క్లుప్తంగా

వెల్లటూరు ఉపాధ్యాయుడికి అభినందనలు



భట్టిప్రోలు: ఏపీఎస్ఎస్‌టీఎఫ్ ఫోరం ఆధ్వర్యంలో విజయనగరంలో జరిగిన రాష్ట్ర స్థాయి వేడుకల్లో భట్టిప్రోలు మండలం వెల్లటూరు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయునిగా పని చేస్తున్న గుర్రం మురళీమోహన్‌ను బుధవారం ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ రఘువర్మ, మన్యం పార్వతీపురం డీఈవో కేపీ నాయుడులు సన్మానించి అభినందించారు. ఇటీవల కృష్ణానదికి సంభవించిన వరదల నేపథ్యంలో విద్యార్థుల కోసం ఆయన చేసిన సేవలను గుర్తించి సన్మానించారు. అలాగే ఎపీఎస్ఎస్‌టీఎఫ్ తరఫున కూడా ఆయన సేవలను పలువురు కొనియాడారు.

బాల్య వివాహాల నియంత్రణ అందరి బాధ్యత



కర్లపాలెం: బాల్య వివాహాల నియంత్రణ బాధ్యత అందరిపై ఉందని సిఫార్డ్ స్వచ్ఛంద సేవా సంస్థ డైరెక్టర్ కె.రవి ప్రదీప్ అన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిన బాల్ వివాహ్ ముక్తి భారత్ కార్యక్రమంపై కర్లపాలెం సచివాలయంలో అవగాహన సదస్సు నిర్వహించారు. సిఫార్డ్ సేవా సంస్థ డైరెక్టర్ మాట్లాడుతూ బాల్య వివాహాల వలన అనేక సమస్యలు ఉత్పన్నమవుతాయని చెప్పారు. మండల న్యాయ సేవాధికార సంస్థ ప్యానల్ లాయర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ బాల్య వివాహాలను నివారించి బాల్య వివాహ రహిత గ్రామాలుగా తీర్చిదిద్దాలని అన్నారు. ఈ కార్యక్రమంలో యాక్సస్ టు జస్టిస్ జిల్లా కో ఆర్డినేటర్ బడుగు కిషోర్, సిఫార్డ్ స్వచ్ఛంద సేవా సంస్థ కో ఆర్డినేటర్ ప్రభాకర్ మహిళా పోలీస్ సౌందర్య, పారా లీగల్ వలంటీర్ పి.ఎం ఖాన్, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

డిసెంబర్ 2 వరకు వరి కోతలు నిలిపివేయాలి

వ్యవసాయ అధికారి బాలాజీ గంగాధర్



చెరుకుపల్లి: తుపాను కారణంగా వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున రైతులు వరి కోతలు నిలిపి వేయాలని మండల వ్యవసాయ అధికారి టి.బాలాజీ గంగాధర్ రైతులకు సూచించారు. బుధవారం మండలంలోని గూడవల్లి, కనగాల గ్రామాల్లో వరి పొలాలను పరిశీలించి రైతులతో మాట్లాడారు. డిసెంబర్ 2వ తేదీ వరకు రైతులు వరి కోతలు నిలిపివేయాలని, ఒకవేళ కోసి ఉన్నట్లయితే వెంటనే కుప్పలు వేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈవోలు, రైతులు పాల్గొన్నారు.

రైతులు వరి కోతలు కోయరాదు

వేమూరు: తుఫాన్ వల్ల ఈ నెల 29 నుంచి 30 వరకు అధిక వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలియజేసిందని మండల వ్యవసాయాధికారి సునీత బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతులు వరి కోతలు కోయరాదని డిసెంబరు 2వ తేదీ తరువాత కోతలు ప్రారంభించాలని ఆమె చెప్పారు. రైతులు కోత కోసి ఉన్నట్లయితే ఆయా గ్రామాల్లో రైతు సేవా కేంద్రాలకు వెళ్లి వ్యవసాయ అసిస్టెంట్ దగ్గర షెడ్యూలు ఇప్పించుకొని కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం అమ్మవలసిందిగా ఆమె తెలిపారు.

సూపర్ సిక్స్‌ను వెంటనే అమలు చేయాలి

వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జేబీ శ్రీధర్



బాపట్లటౌన్: ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబు సూపర్‌సిక్స్‌ను వెంటనే అమలు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జేబీ శ్రీధర్ తెలిపారు. బుధవారం తమ కార్యాలయంలో గృహాలు లేని నిరుపేదలైన రైతుల నుంచి అర్జీలను స్వీకరించారు. శ్రీధర్ మాట్లాడుతూ తల్లికి వందనం అమలు చేయకపోవడం వల్ల వ్యవసాయ కార్మికుల పిల్లల ఫీజులు పెనుభారంగా మారి చదువులు మానేస్తున్నారన్నారు. ప్రభుత్వం ఇచ్చే సంక్షేమ పథకాలతో గ్రామాల్లో, పట్టణాల్లో నివసిస్తున్న పేద ప్రజలకు ఎంతో కొంత ఆర్థిక సహాయం తోడవుతుందని, సూపర్ సిక్స్ హామీలు అమలు కాకపోవడంతో పేదలు ఆర్థికంగా అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. స్కూల్‌కి వెళ్లే ప్రతి విద్యార్థికి రూ.15,000, సాంకేతిక కారణాలను పక్కన పెట్టి అర్హులందరికీ ఉచిత గ్యాస్ సిలిండర్లు ఇవ్వాలి. అలాగే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, యువతకు 20 లక్షల ఉద్యోగాలు, నెలకు రూ.3 వేల నిరుద్యోగ భృతి అందించాలన్నారు. ప్రతి రైతుకి ఏటా రూ.20 వేల పెట్టుబడి సాయం తక్షణమే అందించాలని డిమాండ్ చేశారు.

అమ్మో.. ఇంత వినియోగమా..!?

- పర్యావరణానికి పెనుముప్పుగా మారుతున్న పాలిథిన్
- పాలిథిన్ కవర్ల నియంత్రణపై అధికారులలో కొరవడుతున్న చిత్తశుద్ధి
- మొక్కుబడి తనిఖీలు... ఆర్భాటపు ప్రచారాలతో సరి



రేపల్లెలో చెత్త నిల్వలో అధిక మొత్తంలో పాలిథిన్ బ్యాగులు

రేపల్లె రూరల్: పాలిథిన్ వినియోగం ప్రతి ఒక్కరి జీవితంలో భాగమైపోయింది. శుభకార్యాలు, ఇతర ఫంక్షన్‌లకు ప్లాస్టిక్ కవర్లు, గ్లాసుల వినియోగం విచ్చలవిడిగా మారుతోంది. పాలిథిన్ పర్యావరణానికి హానికరమన్న విషయాన్ని మరచిపోవటంతో కాలుష్యకారిణి అయినటువంటి దీని నియంత్రణ పెనుసవాలుగా నిలుస్తోంది. పాలిమర్లు, మోనోమర్లు వంటి పునరుక్తమయ్యే రసాయన పదార్థాల సమ్మిళితంగా తయారయ్యే పాలిథిన్ వినియోగం నానాటికీ పెరిగిపోతూ పర్యావరణానికి హాని కలిగిస్తోంది. తక్కువ వ్యయంతో ఆకర్షణీయంగా తయారు చేయటంతో ఈ పాలిథిన్ (ప్లాస్టిక్) వస్తువులను తెలిసి కొంత మంది ప్రజలు వినియోగిస్తుంటుంటే, తెలియక కొంత మంది వినియోగిస్తూ పర్యావరణానికి హానికారులుగా మారుతున్నారు.



పాలిథిన్ కవర్లలో వస్తువులను తీసుకెళుతున్న వ్యక్తి

వాతావరణ కాలుష్యం ఏర్పడుతుంది

మార్కెట్‌కు వెళ్ళిన సమయంలో సాధారణ వస్తువులను దుకాణాల యజమానులు పాలిథిన్ కవర్లలో ప్యాక్ చేసి ఇవ్వటం ప్రస్తుతం పరిపాటిగా మారింది. ఇళ్లలో ప్లాస్టిక్ వ్యర్థాలు సైతం ఎక్కువగా పేరుకుపోవటానికి ఇదొక కారణంగా నిలుస్తోంది. చివరికి ఈ పాలిథిన్ రహదారి పక్కనే ఉన్న చెత్తకుండీలలోకి చేరుతోంది. ఎక్కడ పడితే అక్కడ ఈ పాలిథిన్ కవర్లను పడవేయటంతో మురికి కాలువలు సైతం స్థంభించిపోతున్న పరిస్థితి. పర్యావరణ నేస్తం కాని ఈ పాలిథిన్ విచ్ఛిన్నమై, భూమిలో కలిసేందుకు అనేక సంవత్సరాలు పడుతుందని పలువురు శాస్త్రవేత్తలు చెబుతున్నారు. వ్యర్థాలను కాల్చినపుడు అందులో ఈ పాలిథిన్ వల్ల విషపూరిత వాయువులు వెలువడి వాతావరణ కాలుష్యానికి కారణమవుతోంది. దీంతో భూమిని కాపాడే ఓజోన్ పొర సైతం నాశనమయ్యే పరిస్థితి. ప్లాస్టిక్ వ్యర్థాలు భూగర్భ జలాలు ఇంకిపోయేందుకు సైతం కారణంగా మారుతున్నాయి.

మూగజీవాలకు ప్రాణాంతకం

పాలిథిన్ వ్యర్థాలు చెత్తకుప్పలకు చేరిన తరువాత మూగజీవాలకు ఆహార పదార్థాలుగా మారుతున్నాయి. ఈ వ్యర్థాలను మూగజీవాలు ఆహారంగా తీసుకోవటంతో శ్వాసవ్యవస్థ పాడై వాటి మరణానికి దారి తీస్తుంది. ఎక్కువగా ఆవులు, కుక్కలు, పందులు ప్లాస్టిక్ వ్యర్థాలను తీసుకుంటూ మృత్యువాత పడిన ఘటనలు అనేకం ఉన్నాయి.



పాలిథిన్ కవర్లలో వస్తు విక్రయాలు

రేపల్లె పట్టణంలో ఇంత వినియోగమా..?

ఒక్క రేపల్లె మున్సిపాలిటీలోనే రోజుకు 25 టన్నుల చెత్త పోగవుతుంటే అందులో 5 నుంచి 7 టన్నులు పైగా ప్లాస్టిక్ కవర్లు, ప్లాస్టిక్ వస్తువులు ఉన్నాయంటే ప్లాస్టిక్ వినియోగం ఎంతలా ఉందో అర్థం చేసుకోవచ్చు. పట్టణాలతో పాటు పల్లెల్లో సైతం కవర్ల వినియోగం విపరీతంగా పెరిగిపోయింది. బజారు నుంచి కొనుగోలు చేసిన వస్తువులు తెచ్చుకునేందుకు వినియోగించే కవర్లు బహిరంగంగా పడవేయటంతో పెను ప్రమాదం సంభవించనుంది.

మొక్కుబడిగా తనిఖీలు

పర్యావరణ పరిరక్షణకు కవర్లను నియంత్రించాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చిన ప్రతిసారి అధికారులు నామమాత్రంగా తనిఖీలు నిర్వహించి చేతులు దులుపుకుంటున్నారు. ఒకటి రెండు రోజులు పట్టణంలో హడావుడి చేస్తూ మొక్కుబడిగా ప్రచారం నిర్వహిస్తూ మమ అనిపిస్తున్నారు. దీనివల్ల ఆ రెండు రోజులు అటు వ్యాపారులు ఇటు వినియోగదారులు కవర్లను దాచి తర్వాత యథావిధిగా విక్రయాలు, వినియోగాలు చేస్తున్నారు. ప్లాస్టిక్ కవర్ల నివారణకు చిత్తశుద్ధితో నిరంతరం తనిఖీలు నిర్వహిస్తూ వియోగదారులకు, వ్యాపారులకు అపరాధ రుసుం విధించటంతో పాటు షాపుల లైసెన్సులు రద్దు చేస్తామని కఠిన నిబంధనలు అమలు చేస్తేనే పాలిథిన్ నివారణ సాధ్యమవుతుంది.

ప్రత్యామ్నాయం బహుబాగు

పర్యావరణానికి హాని కలిగించే పాలిథిన్ స్థానంలో ప్రత్యామ్నాయాల వినియోగంతో పర్యావరణాన్ని కాలుష్య కోరల నుంచి రక్షించవచ్చు. గన్నీ బ్యాగ్‌లు, గుడ్డ సంచులు, జనపనార సంచులను వినియోగించటంతో ప్రతి ఒక్కరూ పర్యావరణ హితులుగా మారవచ్చు. పాలిథిన్ వినియోగం తగ్గించటం, తిరస్కరించటం ద్వారా ప్రతి ఒక్కరూ పర్యావరణ మిత్రులుగా మారాలని ప్రజా సంఘాలు కోరుతున్నాయి.

చర్యలు తీసుకుంటాం



పాలిథిన్ కవర్లు, వస్తువులను వినియోగించరాదంటూ పలుమార్లు పట్టణంలో ఇప్పటికే ప్రచారం నిర్వహించాం. ఇక నుంచి పాలిథిన్ విక్రయాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవటం జరుగుతుంది. అదే విధంగా పాలిథిన్ కవర్లు వాడే వినియోగదారులపై సైతం చర్యలు తీసుకుంటాం. ప్రతి ఒక్కరూ పాలిథిన్ స్థానంలో ప్రత్యామ్నాయ వస్తువులు వినియోగించాలి.

– కాకర్ల సాంబశివరావు, మున్సిపల్ కమిషనర్, రేపల్లె

వేణుగోపాలస్వామికి అష్టోత్తర కలశాభిషేకం



అమర్తలూరు (వేమూరు): మండలంలోని మోపర్రు గ్రామంలో వేం చేసి ఉన్న వేణుగోపాల స్వామికి కార్తిక మాసం పురస్కరించుకుని బుధవారం వైఖానస ఆగమ శాస్త్రం ప్రకారం అష్టోత్తర కలశాభిషేకం నిర్వహించారు. ఆలయ అర్చకులు బృందావనం వరదాచార్యులు పర్యవేక్షణలో ఉదయం సుప్రభాత సేవ అనంతరం విశ్వక్సేన ఆరాధన, కలశ పూజ, అఖండ దీపారాధన మండపారాధన, 108 కలశాల తీర్థజలంతో, పంచామృతాలతో అభిషేకం జరిపారు. అనంతరం స్వామి వారిని అలంకరించారు. సాయంత్రం పంచ హారతులు సమర్పించి కోటి దీపోత్సవం నిర్వహించారు. ఉత్సవమూర్తులను ఆలయం చుట్టూ ఊరేగించారు. అనంతరం గ్రామోత్సవం జరిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పాల ఉత్పత్తిదారుల సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి మృతి



చుండూరు(వేమూరు): పాల ఉత్పత్తిదారుల సహకారం సంఘం అధ్యక్షులు ఈమని శ్రీనివాస్ రెడ్డి (80) గుండె పోటుతో మృతి చెందాడు. వేమూరు నియోజకవర్గం చుండూరు మండలంలోని వలివేరు గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు పాల ఉత్పత్తిదారు సహకారం సంఘం అధ్యక్షులుగా పని చేశారు. బుధవారం తెల్లవారుజామున గుండె పోటు రావడంతో ఆయన మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆయన భౌతికకాయానికి వైఎస్సార్‌సీపీ నాయకులు నివాళులర్పించి, సంతాపం వ్యక్తం చేశారు.

ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేస్తుంది

పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ భరోసా



జంపని గ్రామంలో ధాన్యం పరిశీలిస్తున్న మంత్రి నాదెండ్ల

వేమూరు: రైతులు పండించిన పంటను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ భరోసా ఇచ్చారు. డెల్టా ప్రాంతంలోని మంగళగిరి, తెనాలి, వేమూరు నియోజకవర్గాల్లో బుధవారం ఆయన పర్యటించారు. జంపని గ్రామంలో ధాన్యం కల్లాలు పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ధాన్యంలో తేమ శాతం 25 ఉన్న కొనుగోలు చేయడం జరుగుతుందని రైతులు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో అమ్ముకోవాలని సూచించారు. ధాన్యం అమ్మిన 24 గంటల్లో రైతుల అకౌంట్‌లో డబ్బులు జమ చేసేందుకు ఏర్పాట్లు చేయడం జరిగిందని చెప్పారు. వర్షాల వల్ల రైతులు ఆందోళన చెందాల్సిన పని లేదని, ధాన్యం రైస్ మిల్లులకు తరలించేందుకు వాహనాలు ఏర్పాటు చేయాలని తహసీల్దారుకు ఆదేశాలు జారీ చేయడం జరిగిందని అన్నారు. రైతులకు ఇబ్బందులకు గురి కాకుండా స్థానిక యంత్రాంగం అందుబాటులో ఉంటుందని, ప్రభుత్వం 75 కిలోల బస్తా రూ.1,740 కొనుగోలు చేయడం జరుగుతుందని తెలిపారు. రైతులు ప్రయివేటు వ్యాపారస్తులకు అమ్మి మోస పోవద్దన్నారు. ప్రభుత్వం రైతులకు అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రేపల్లె ఏడీఏ ఆర్ విజయబాబు, ఏఓ సునీత, రైతులు, గ్రామ వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

బలహీనమవుతున్న కాల్వ కట్టలు



రేపల్లె ప్రధాన మురుగుకాల్వ కట్టపై ఈదుపల్లి బ్రిడ్జి సమీపంలో తరలిస్తున్న మట్టి



ఈదుపల్లిలో సీసీ రోడ్డు నిర్మాణానికి వినియోగిస్తున్న మురుగు కాల్వ కట్టల మట్టి

- అక్రమంగా తరలుతున్న మురుగుకాల్వల కట్టల మట్టి
- పట్టించుకోని డ్రైనేజ్ అధికారులు

నగరం: అక్రమార్జనే లక్ష్యంగా టీడీపీ నాయకులు ఇష్టారాజ్యంగా అక్రమంగా మట్టిని తరలించి జేబులు నింపుకుంటున్నారు. ఎక్కడ మట్టి అవసరమైనా మురుగు కాల్వల కట్టల మట్టిని యథేచ్ఛగా తరలిస్తుండటంతో కాల్వ కట్టలు బలహీనమవుతున్నాయి. రేపల్లె ప్రధాన మురుగు కాల్వ(ఆర్ఎం డ్రైన్) న్యూ కోర్స్ కాల్వ కట్టల మట్టిని అక్రమంగా తరలిస్తున్నా పట్టించుకునే వారు కరువవ్వడంతో కాల్వ కట్టలు బక్కచిక్కిపోతున్నాయి. ఈదుపల్లి వంతెన సమీపంలో మురుగు కాల్వ కట్టల మట్టిని తరలించుకుపోతున్నారు. పట్టపగలు కూడా కాల్వ కట్టల మట్టిని జేసీబీలతో తవ్వి ట్రాక్టర్‌లతో తరలిస్తున్నా ఎవ్వరూ పట్టించుకోవడం లేదంటే డ్రైనేజ్ అధికారుల పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. కొంతమంది అక్రమార్కులు రాత్రి సమయంలో ఎక్కడ పడితే అక్కడ కాల్వ కట్టల మట్టిని తరలించడంతో కట్టలు గుంతల మయంగా మారాయి.

కాల్వ కట్టల మట్టిని తరలిస్తే చర్యలు తీసుకుంటాం

మురుగుకాల్వల కట్టల మట్టిని తరలిస్తే సహించేది లేదు. కట్టల మట్టిని తరలిస్తున్నారనే విషయం ఇప్పుడే దృష్టికి వచ్చింది. కాల్వ కట్టలపై గస్తీ ఏర్పాటు చేసి కట్టల మట్టి తరలకుండా చర్యలు చేపడతాం. – వీరయ్య, డ్రైనేజ్ డీఈ

సర్వే సక్రమంగా చేయాలి



విద్యార్థులతో కలసి భోజనం చేస్తున్న ఎంపీడీవో శ్రీనివాసరావు



జియో ట్యాగింగ్ సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీవో శ్రీనివాసరావు

బీసీ బాలుర హాస్టల్‌ను సందర్శించిన ఎంపీడీవో

కర్లపాలెం: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన సర్వే కార్యక్రమాన్ని సచివాలయ సిబ్బంది సక్రమంగా నిర్వహించాలని ఎంపీడీవో అద్దూరి శ్రీనివాసరావు చెప్పారు. బుధవారం ఎంపీడీవో శ్రీనివాసరావు చింతాయపాలెం గ్రామ సచివాలయాన్ని సందర్శించి రికార్డులు పరిశీలించారు. అనంతరం గ్రామంలో జరుగుతున్న సర్వే కార్యక్రమాన్ని పర్యవేక్షించి జియో ట్యాగింగ్ సక్రమంగా నిర్వహించాలని చెప్పారు. పెదపులుగువారిపాలెంలో జరుగుతున్న 108 వైద్య శిబిరాన్ని తనిఖీ చేసి దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు మెరుగైన వైద్య సేవలందించాలని సూచించారు.

బుధవారం రాత్రి కర్లపాలెం మండల కేంద్రంలోని బీసీ బాలుర హాస్టల్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. హాస్టల్‌లో విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. మరుగుదొడ్లను పరిశీలించి విద్యార్థులు పడుకుంటున్న రూమ్‌లను పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో కలసి ఆయన భోజనం చేశారు.

ఎన్‌పీసీఐ ఆధార్ మ్యాపర్ క్యాంప్‌ను సద్వినియోగం చేసుకోవాలి

రేపల్ల పోస్టల్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ ఏడుకొండలు



నిజాంపట్నం: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేసే సంక్షేమ పథకాల లబ్ధిని పొందాలంటే ఎన్‌పీసీఐ ఆధార్ మ్యాపర్ చేయించుకోవాలని రేపల్లె పోస్టల్ కార్యాలయ అసిస్టెంట్ సూపరింటెండెంట్ ఏడుకొండలు తెలిపారు. మండల కేంద్రమైన నిజాంపట్నం పోస్టాఫీసు, మండలంలోని వివిధ పోస్టల్ కార్యాలయాల్లో నిర్వహిస్తున్న నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ) నిర్వహిస్తున్న ఆధార్ మ్యాపర్ క్యాంప్‌లను బుధవారం ఆయన పరిశీలించి మాట్లాడారు. ప్రజల కోసం నిర్వహిస్తున్న ఎన్‌పీసీఐ క్యాంప్‌ను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. సమీపంలోని పోస్టాఫీసులలో ఈ అనుసంధాన ప్రక్రియ జరుగుతుందని, లబ్ధిదారులు ఆధార్, ఫోన్ నంబరుతో పాటు తమ వివరాలను తెలియజేసి కేవలం రూ.200 చెల్లించాలన్నారు. నెఖారులోపు ఎన్‌పీసీఐ చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పోస్ట్‌మాస్టర్‌లు, బీపీఎంలు, ఏబీపీఎంలు తదితరులు పాల్గొన్నారు.

తుఫాన్ హెచ్చరికలతో రైతులు అప్రమత్తంగా ఉండాలి



గణపవరం(కర్లపాలెం): తుఫాన్ ప్రమాదం పొంచి ఉన్నందున రైతులు అప్రమత్తంగా ఉండాలని బాపట్ల వ్యవసాయ సహాయ సంచాలకులు ఎ.లక్ష్మి చెప్పారు. బుధవారం చింతాయపాలెం, గణపవరం గ్రామాలలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ ప్రస్తుతం వరి పైరు కోత దశలో ఉన్నందున తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో వరి కోతలు చేపట్టవద్దని రైతులకు సూచించారు. తుఫాన్ ప్రభావం తగ్గిన తరువాత కోతలు చేపట్టాలని అన్నారు. రైతులు ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలలో విక్రయించుకోవాలని చెప్పారు. ప్రభుత్వం గ్రేడ్ ఏ ధాన్యం క్వింటా రూ.2,320కు, సాధారణ రకం రూ.2,300కు కొనుగోలు చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏవో సుమంత్‌కుమార్, గ్రామ వ్యవసాయ సహాయకులు వేదశ్రీ, ధృవకుమార్, రైతులు పాల్గొన్నారు.

మహిళపై దాడి

తెనాలిరూరల్: టీ దుకాణం నిర్వహించే మహిళపై దాడి చేసి బెదిరించిన ఘటనపై కేసు నమోదైంది. పోలీసులు కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. పట్టణ మారిస్‌పేటకు చెందిన నాగిశెట్టి రాధ, జిలాని దంపతులు మార్కెట్ ఏరియాలో ప్రతిరోజు తెల్లవారుజామున దుకాణం నిర్వహిస్తుంటారు. బుధవారం దుకాణం తెరచిన కొద్దిసేపటికే మారిస్‌పేటకే చెందిన షేక్ కమల్ వీరి బండి వద్దకు వచ్చి అద్దాలను పగులగొట్టి, రాధపై దాడి చేసి బెదిరింపులకు పాల్పడ్డాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దాడి ఘటనపై కేసు

తెనాలిరూరల్: దాడి ఘటనపై కేసు నమోదైంది. మండలంలోని కొలకలూరుకు చెందిన విలేకరి నూతక్కి అచ్యుతాచారి మంగళవారం రూరల్ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లగా అదే గ్రామానికి చెందిన పొన్నెకంటి రమేష్ వాగ్వాదానికి దిగి దాడి చేశాడు. తెనాలి జిల్లా వైద్యశాలలో చికిత్స పొందుతూ ఇచ్చిన ఫిర్యాదు మేరకు వన్ టౌన్ పోలీసులు కేసు బుధవారం నమోదు చేశారు.

హార్వెస్టర్స్‌తో వరి కోతలు



భట్టిప్రోలులో హార్వెస్టర్‌తో కోతలు కోస్తున్న దృశ్యం



పెదపులివర్రులో ధాన్యాన్ని ఆరబెడుతున్న దృశ్యం

- వాతావరణం అనుకూలించక పోయినా కోతలకు శ్రీకారం
- దిగుబడులను కాపాడుకునేందుకు పడరాని పాట్లు

భట్టిప్రోలు: వాతావరణ పరిస్థితులు అనుకూలించకపోవడంతో రైతులు వేమూరు నియోజకవర్గంలో వరి కోతలు ముమ్మరం చేశారు. దేవునిపై భారం వేసి గండం నుంచి గట్టెక్కాలని కోరుకుంటున్నారు. ఈ సందర్భంగా కొల్లూరు, వేమూరు భట్టిప్రోలు, చుండూరు, అమృతలూరు, మండలాల్లో వరి కోతలు కొనసాగుతున్నాయి. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. కోతకు వచ్చిన పంటలను వెంటనే కోసి భద్రపరచుకోవాలని రైతులకు సూచించింది. ప్రస్తుతం వాతావరణ పరిస్థితులు అనుకూలంగా లేకపోయినప్పటికీ వరి కోతలకు శ్రీకారం చుట్టారు. వేమూరు నియోజకవర్గంలో 95 వేల ఎకరాల్లో వరి పంట సాగవుతుండగా ప్రస్తుతం హార్వెస్టర్ ద్వారా వరి కోతలు జరుగుతున్నాయి. కోసిన పంటను కాపాడుకునేందుకు రైతులు పడరాని పాట్లు పడుతున్నారు. ఎకరా కోత కోయడానికి గంటన్నర వ్యవధి పడుతుండగా ఎకరాకు రూ.4 వేల నుంచి రూ.6 వేల వరకు తీసుకుంటున్నారు. కూలీల కొరత ఉండటంతో యంత్రాల వైపే మొగ్గు చూపుతున్నారు. వ్యవసాయ కూలీలు రూ.5 వేల నుంచి రూ.8 వేల వరకు కోత కూలీ తీసుకుంటున్నారు. ఎకరాకు 30 నుంచి 35 బస్తాలు మాత్రమే దిగుబడులు వస్తాయని రైతులు అంటున్నారు. వెల్లటూరు చానల్‌పై చప్టా కూలిపోవడంతో ఈ రబీ సీజన్‌కు గాను పంటలకు నీటి సదుపాయం అందించలేమని జల వనరుల శాఖ ప్రకటించిన దృష్ట్యా బోర్లు ఉన్న రైతులు మొక్కజొన్న, జొన్న పంటలు సాగు చేసుకునేందుకు సన్నాహాలు చేసుకుంటుండగా సాధ్యం కాని వారు మినుము, పెసర పంటలు వైపు దృష్టి సారిస్తున్నారు.

రైతులు అప్రమత్తంగా ఉండాలి



రైతులు తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలి. పైరు పనలు తడిస్తే ఉప్పు ద్రావణంలో కంకులను ముంచి ఆరబెట్టాలి. కోత కోసిన ఎడల కల్లాలను టార్పాలిన్ పట్టాలతో కప్పి భద్రపరచి ఇళ్లు లేదా గోదాములకు తరలించాలి. వరి కోతలు కోయని వారు వాతావరణ పరిస్థితులను బట్టి కోతలను నిలుపుదల చేయాలి. సాధ్యమైనంత వరకు హార్వెస్టర్ ద్వారా ధాన్యాన్ని సేకరించి సురక్షిత ప్రదేశంలో పట్టాలు కప్పి భద్రపరచుకోవాలి.

– జి. మీరయ్య, ఏఓ, భట్టిప్రోలు

చప్టా పునర్నిర్మాణ పనులు వెంటనే నిర్వహించాలి

రైతు సంఘం బాపట్ల జిల్లా అధ్యక్షులు వెంకట్రామయ్య



కూలిన చప్టాను పరిశీలిస్తున్న ఆంధ్రప్రదేశ్ రైతు, కౌలు రైతు సంఘాల బృందం

భట్టిప్రోలు: భట్టిప్రోలు మెయిన్ డ్రైయిన్‌పై బ్రిటీష్ కాలంలో నిర్మించిన చప్టా కూలిపోవడంతో ప్రభుత్వం వెంటనే పునర్నిర్మాణ పనులు నిర్వహించాలని ఆంధ్రప్రదేశ్ రైతు, కౌలు రైతు సంఘాలు బుధవారం డిమాండ్ చేశాయి. ఈ సందర్భంగా కూలిన చప్టాను ఆయా సంఘాలు పరిశీలించాయి. రైతు సంఘం బాపట్ల జిల్లా అధ్యక్షులు వేములపల్లి వెంకట్రామయ్య మాట్లాడుతూ చప్టా కూలిపోవడంతో నాలుగు మండలాల్లో సూమారు 50 వేల ఎకరాలకు సాగునీరు అందని పరిస్థితులు ఏర్పడ్డాయని పేర్కొన్నారు. పంట చేతికి వచ్చే దశలో లేత వరి పైరుకు నీరు అందించకపోతే దిగుబడులు గణనీయంగా తగ్గిపోతాయని తెలిపారు. పరిస్థితిని చూస్తే రెండవ పంటకు కూడా సాగు నీరు అందేలా లేదని అన్నారు. ముందస్తు కౌలు చెల్లించి, పెట్టుబడి ఖర్చులు పెరిగి కౌలు రైతులు తీవ్రంగా నష్టపోయారని చెప్పారు. ప్రభుత్వం వెంటనే చప్టా పునర్నిర్మించి సాగునీరు అందించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో ఆర్ఐ ఫణికుమార్‌కు వినతిపత్రం అందచేశారు. కార్యక్రమంలో కౌలు రైతు సంఘం బాపట్ల జిల్లా అధ్యక్షులు తోడేటి సురేష్, సీపీఎం మండల కార్యదర్శి జి.సుధాకర్, ఆయా సంఘాల నాయకులు ఎం.సత్యన్నారాయణ, పప్పుల అహరోను తదితరులు పాల్గొన్నారు.